
# ముసిలిదాని చావు

డా॥ బి.ఎస్.ఎన్. మూర్తి



పట్టుమని పదిరోజులు కాలేదు. ఎగువవీధిలో పదేళ్ళ కుర్రాడికి జ్వరం వచ్చిన మర్నాడే చచ్చిపోయాడు. వారంరోజుల క్రిందట దిగువ వీధిలో అయిదేళ్ళ బుడతడికి జ్వరం వచ్చింది. పట్నం తీసుకెళ్లేలోపునే వాడి ప్రాణాలు పోయాయి. నాలుగు రోజుల క్రిందట నరిసిగాడు పొలానికి వెళ్ళాడు. వాడికి నిండా నలభై ఏళ్ళు లేవు. దుక్కలా ఉండేవాడు. పొలంలో ఏమయిందో మరి టపీమని చచ్చాడు. ఈ పదిరోజుల్లో మూడు చావులా? దీనికంతా కారణం ఉండే ఉంటుంది.

గూడెం మధ్యలో మర్రి చెట్టుంది. ఆ సాయంత్రం దానికింద కూర్చుని అంతా మాట్లాడుకొంటున్నారు. అందులో ఒకడు లేచాడు. వాడి పేరు మల్లయ్య. వాడివంటికి ఏభై ఏళ్ళున్నాయి. కాని బుర్ర వందేళ్ళ అనుభవసారంతో పండిపోయినట్లు మాట్లాడుతాడు. క్రిందటేడు ఊరిపొలిమేరల్లో భూములు కొన్నవాళ్ల మధ్య తగాదాలయ్యాయా ఆ వివరాలు తెలుసుకొనేందుకు సి.ఐ గారు అతడిని రెండుమూడు సార్లు పోలీసు స్టేషనుకు రప్పించాడు. దాంతో ఊర్లో వాడి పరపతి పెరిగిపోయింది. వాడు ఏం మాట్లాడుతాడో అని అందరూ చెవులు రిక్కించి వినసాగేరు.

''మనూరికి పట్టుమని ఏభై గడపనేదు. ఈ పదిరోజుల్లో ముగ్గురు సచ్చిపోనారంటే మనూరికి ఏటో అవుతున్నాది. ఒక్క సిటం ఆలోచించండి'' అంటూ ఆగాడు. చుట్టూ చూసాడు. ఎవరూ మాట్లాడలేదు. తనే మళ్ళీ అన్నాడు ''ఏటి ఎవడి బుర్రలోనూ నైటు ఎలగనేదా? మన గూడెంమీదికి అమ్మోరికి కోపం వచ్చుండాల. వస్తే ఎందుకొచ్చిందో సూడండి. అలా కాదంటే ఎవడో పనికిమాలినోడు సేతబడో సిల్లంగో ఎడుతూండాల. అందుకే ఈ సావులు. ఆ ఎట్టి నోడెవడో ఆలోసించండి''.

గుంపులో నుండి ఒకడు లేచాడు. ''అమ్మోరికి పూజలు సేత్తున్నాం. నయివేద్దేలెడుతున్నాం. కోడి పుంజున్ని బలేత్తున్నాం. జాతర సేత్తున్నాం. అలాంటిది అమ్మోరికి కోపమెందుకు వస్తాది? ఇంకేటో అయి ఉంటాది సూడండి'' అన్నాడు.

''మరయితే అది సిల్లంగే. అంటే ఎవలో దెయ్యాలకు మంత్రాలు సెదివి మడుసుల మీదికి ఆళ్లని సంపేమని వగ్గేత్తురన్నమాట'' అన్నాడు ఇంకొకడు.

గుంపులోనుండి మరోమనిషి లేచాడు. ''ఇంకెవలు? ఊరి సివార్న మలుపు కాడ కొత్తగా గుడిసె ఏసుకొన్న దొమ్మరోళ్ళు. అందులో ఒక ముసిల్ది ఉంది. అది రేతిరి పూట అటూ ఇటూ తిరుగాడ్డం నాను సూసాను. ఆడి

గుడిసె ముందటా, ఈడి కొంపముందటా కూకోడం సూసాను. అలా కూకుని పట్టిపట్టి సూస్తూ ఏటో మాటాడుకోడం నాను యిన్నాను''.

''అవునవును. అదంతా మామూ సూసాము'' అన్నారు మరికొందరు

''అది మాటాడుకొంటున్నదా? మంతరమేస్తున్నాదా? ఎవడికెరుక్క'' అన్నాడు మరోకడు.

ఆ కుటుంబం గురించి వివరాలు రాబట్ట సాగేరు.

''అసలు ఆళ్లెవరు? ఏడనుండి వచ్చారు?''

''ఆళ్ళు ఈ మజ్జనే వచ్చినోళ్లు. ఏ ఊరినుండి వచ్చారో ఎవలికీ తెలీదు''

''ఆళ్ళేం సేత్తుంటారు?''

''దొమ్మరోళ్లట. మగాడు, ఆడిపెళ్ళాం, పటేళ్ళ కూతురూ, ఇంకా బామ్మరిది ఒకడున్నాడు. ఆళ్ళంతా కలిసి సాములూ, గారడి యిద్యలు సేత్తుంటారు''.

''అలాగలాగా ఏటాయిద్యలు?''

''రోడ్డుమీద అటోకర్రా, ఇటోకర్రా నిలబెడతారు ఆటికి తాడుకడతారు. ఆ తాడు మీద పదేళ్ళ గుంట కర్రపట్టుకొని సకసకానడుస్తాది. పట్నంలో సర్కాసులో ఒకపాలి మనం సూశాం అలాంటి ఇజ్జే''.

అది సూసినోళ్ళున్నారా?

''నాన్సూశాను''

''నానూ సూసాను''

''అలా నడిసినపుడు ఆ పిల్ల పడిపోతాదేమోనని బయ్యమేసింది''.

''ఇసయం అదికాదు. ముసలిదాన్ని వగ్గేసి పిల్ల గురించి మాటాడుతారేటి?''

''ఆ ముసిల్ది ఆ మగాడికి తల్లి అవుద్ది. ఆళ్ళతో బాటే ఉంటాది.''

''ఆళ్ళు బయటికెళ్ళినపుడు అదొక్కర్తే గుడిసెలో కూకుంటాది. ఆళ్ళు తిరిగొచ్చేక ఇది బయట తిరుగుతాది. పండు జుట్టూ జడలు కట్టేసి. ఆ కళ్ళు సూత్తే రాజేసిన బొగ్గులా ఎర్రగున్నాయి. అది వంగి వంగి నడుత్తూ ఉంటే స్మశానం నుండి శవం నెగిసి వచ్చినట్టుంటాది. అదే రాతిలేల గూడెమంతా తిరుగుతూ ఉంటాది.

''అదెందుకు తిరుగుతున్నాదో దాన్నే అడిగితే పోలా?''

''అదేటి సెప్తాది? దాన్ని ఈడ్చుకొచ్చేసి ఆ ముందరిపళ్ళు ఊడగొట్టేత్తే మరెవరికీ సిల్లంగి ఎట్టనేదు.''


''దాన్ని ఇక్కడకు అట్టుకురండి''.

మల్లయ్య మరో ఇద్దరితో కలిసి అక్కడినుండి ముసిల్దాని గుడిసె వైపు వెళ్ళాడు. ఆసమయంలో గుడిసెలో అది ఒక్కర్తే ఉంది. దాని జబ్బ పట్టుకొని, అది చెప్పేమాటకూడా వినకుండా బరబరా తీసుకొచ్చేసాడు. దాని పక్కన పులిని ఒంటి చేత్తో పట్టుకున్నవాడిలా నిలబడి గర్వంగా అందరివైపు చూసాడు. తర్వాత దాని వైపుతిరిగి అడిగాడు.

''రాతిరేల అందరి గడపల ముందూ ఎందుకు తిరుగుతూంటావు?''

ముసిల్ది నడుం చాచి నిలబడబోయింది. కానీ వల్లకాలేదు. తలపైకెత్తి ఎర్రటి జీరలు కమ్ముకున్న కళ్ళతో అందర్నీ భయంగా చూసింది. ''నాకు సుస్తీ సేసింది. వంట్లో రకతముందో నేదో తెలీదు. నిద్దర ట్టక కాళ్ళీడ్చుకొంటూ అలా తిరుగుతూంటాను''.

''మరి ఈ గూడెంలోని జనాలకు చిల్లంగులు ఎడుతున్నావు జనాలు సచ్చిపోతున్నారు. నువ్వే ఆ సిల్లంగులు ఎడుతున్నావని మాకు సాచ్చీకాలు దొరికాయి'' అన్నాడు.



ఆ ముసిల్ది వంగునే గుండె బాదుకొంది. ''అయ్యో... అయ్యో..నానేటి? సిల్లంగులు ఎట్టడమేటి? మేం దొమ్మరోళ్ళం. ఊరూరా తిరుగుతూ ఉండేవోళ్లం. ఈయేల ఈ ఊరు. రేపు మరో ఊరు. డొక్కాడే సోటుకి ఎలిపోతూ ఉంటాం. అయినా నన్ను సూడండి ఎలా గవుపిస్తున్నాను. సచ్చిపోడానికి తయ్యారుగా ఉన్న నాను సంపుకు తినే దానిలా అగుపిస్తున్నానా?'' అంది.

''దాన్ని అడిగేదేటి? అది అబద్దమే సెబుతుంది. ముందట దాని నోట్లో రెండు పళ్ళు పీకెయ్యండర్రా. పళ్ళు పోతే అదిమరి మంత్రాలుసెదవనేదు'' అన్నాడొకడు.

ఆమెను పట్టుకొని రెండు చేతులూ వెనక్కి విరిచి అక్కడే ఉన్న ఒక రాటకు కట్టేసారు. పళ్ళు ఊడగొట్టడానికి చిన్న సైజు రాతి ముక్క కావాలి. దానికోసం చుట్టూ వెదకసాగేరు.

అదే సమయానికి ఊర్లోకి ఒక మోటారు సైకిలు దడదడమంటూ వచ్చి ఆగింది. దానిమీద నుండి పాతికేళ్ళ యువకుడు దిగాడు. అతడి పేరు కామేశ్వర రావు. యూనివర్సిటీలో రీడరుగా ఉంటున్నాడు. సెలవులకని దగ్గర్లో ఉన్న మరో గ్రామానికి, బంధువుల ఇంటికి వచ్చాడు. పల్లెటూర్ల ప్రకృతి అందాలు, పల్లెల్లో జీవన విధానం అన్నీ సరదాగా పరిశీలిద్దామని బయలుదేరి మోటారు సైకిలు మీద తిరుగుతూ ఈ గూడేనికి వచ్చి ఆగాడు. ముసిల్ది గుంజకు కట్టబడి ఉండటం చూసాడు. ఇక్కడేదో జరగకూడనిది జరుగుతూందని గ్రహించాడు. విషయం ఏమిటని అడిగాడు.

అక్కడున్న వాళ్ళందరూ చెప్పబోయారు. కాని మల్లయ్య వారందరినీ వారించి తనే జరుగుతూన్న విషయం అంతా వివరించి చెప్పాడు. ''ఊరికి సిల్లంగులు పోవాలంటే దాని పళ్ళు పీకాల్సిందే'' అన్నాడు.

అతడికి అక్కడ జరుగుతూన్న ఘోరం ఆపాలనిపించింది. వారందరికీ నచ్చ జెప్పాడు. ''వాటిని మీరు చిల్లంగులంటారో, చేతబడులంటారో మీ ఇష్టం. కాని ఇవన్నీ మూఢనమ్మకాలు. నిజంకాదని సైంటిస్టులు తేల్చిసారు. వీటిని నమ్మకండి.''

అందరూ అయిష్టంగా చూసారు. అయినా తన ప్రయత్నం విరమించుకోలేదు. ''మీకు తెలీదా చట్టాలున్నాయి. పోలీసులున్నారు. కోర్టులున్నాయి. ఈ రోజుల్లో ఇలాంటి తెలివితక్కువ నమ్మకాలతో అవతలవ్యక్తికి అపకారం చేస్తే పేపరువాళ్ళు రాస్తారు. పోలీసులు జైళ్ళో పెట్టేస్తారు. ముందా కట్లు విప్పండి.''

పోలీసులు, జైలు అనగానే అందరూ భయపడ్డారు. ఒకడు ముసలమ్మ కట్లు విప్పాడు.

తన మాటవిని ఆమె కట్లు విప్పినందుకు కామేశ్వరరావు సంతోషించాడు.

''దాన్ని వగ్గేసి మన మంతా సుకంగా పడుకోగలమా సెప్పండి. పట్నం నుండి వచ్చినోళ్ళు ఏటేటో సెబుతూంటారు. ఆళ్ల మాటలు నమ్ముతారా? ఊళ్ళో జరుగుతున్న గోరాలు సూశాక ఇంకా ఆలీసమెందుకు. పోలీసోళ్ళు జైల్లో ఎట్టేసుకోని. ఆళ్ల జైల్లో ఎడతారని బయపడిపోతూంటే ఊరేమవుద్ది? ముందర దానికి సిచ్చ పడాల.''

కాని మరొక వ్యక్తి అన్నాడు ''దాన్ని వగ్గేసి మనమంతా సుకంగా పడుకోగలమా సెప్పండి. పట్నం నుండి వచ్చినోళ్ళు ఏటేటో సెబుతూంటారు. ఆళ్ల మాటలు నమ్ముతారా? ఊళ్ళో జరుగుతున్న గోరాలు సూశాక ఇంకా ఆలీసమెందుకు. పోలీసోళ్ళు జైల్లో ఎట్టేసుకోని. ఆళ్ల జైల్లో ఎడతారని బయపడిపోతూంటే ఊరేమవుద్ది? ముందర దానికి సిచ్చ పడాల.''

''నిజమేరా'' అనుకున్నారంతా ముసిల్దాని చేతులు మళ్లీ వెనక్కి విరిచి కట్టేసారు.

కామేశ్వర రావులో తనోవిజయం సాధించానన్న ఆనందం ఎంతోసేపు నిలవలేదు.

అదే సమయానికి పెంచలయ్య పొలంలో పనిచేసుకొని, పశువుల్ని సాలలో కట్టేసి అక్కడకు వచ్చాడు అతడు ఆ ఊరికి పెద్ద. కాని సాధారణంగా ఎవరి విషయాల్లోనూ జోక్యం చేసుకోడు కొత్త కుర్రాడిని, అక్కడ గుమిగూడిన గూడెం జనాలను చూసి ''ఏటి ఇసయం'' అని అడిగాడు.


అందరూ చెప్పారు. చెప్పిందంతా విన్నాడు.

''ఆ కుర్రాడు సెక్కటిమాట సెప్పాడు. అతగాడు సెప్పింది రైటే'' అన్నాడు.

ఆ మాట గూడెం జనాలకు నచ్చలేదు. అందరూ అతడిమీద కేకలువేయసాగేరు. ముక్కు మొహం తెలియని ఒక కొత్త వ్యక్తిని అతడు వెనకేసుకురావడం వారికి నచ్చలేదు.

పెంచలయ్య మళ్లీ అన్నాడు. ''మీరు సెప్పిందీ రైటే. నాను కాదనీనేదు. కాని నేను సెప్పేది యినండి''

అందరిలోనూ ఆవేశం తగ్గింది. అతడేం చెబు




తాడో అని వినసాగేరు. "మనకీ ముసిల్దాని వల్ల బాదలున్నాయి. ఆ బాదలు పోవాలి. అంతేకదా".

"అవునవును" అన్నారందరూ.

అందుకోసం మనం ఈ ముసిల్దాన్ని ఏటి సెయ్యక్కరనేదు. ఇక్కడికి నాలుగు కోసల దూరంలో 'కెంగువ' అని ఓ పల్లె ఉంది. అక్కడ కొత్తగా దేవుడు ఎలిసాడు. మీ కందరికీ ఎరుకా?"

"మాకు ఎరుకనేదు" అన్నారందరూ.

"రెండురోజుల్లో కార్తీక పున్నమి. అదేరోజు ఆ దేవుడికి జాతర జరుగుతాది. ఆ జాతరకు మన మంతా తరలివెళ్లాలి. ఆ దేవుడికి నిమ్మకాయలు మాత్తరమే నయివేద్దెం ఎట్టాలి. ఆటిని మంతిరించి మనకే తిరిగి ఇచ్చేత్తాడు. అవి ఇంటి సూరుకు కడితే దెయ్యాలూ, బూతాలూ, గీడలూ సిల్లంగులూ ఏటీ ఇంటిలోని మడుసుల దాపుకు రావు. ఎవడైనా ఆ మడుసులకు సిల్లంగి ఎడితే ఆడే ముందు సస్తాడు.

అందరికి నమ్మశక్యం కాలేదు. "ఎవరీ కొత్త దేవుడు? మా మెప్పుడూ యినలేదు" అన్నారు చాలా మంది.

"అవును ఆడెవడో కొండదొర కొన్నిపంటల కిందట ఆ ఊరికి వచ్చేసి శివుడి కోవెల్లో బస పెట్టేసాడు. ఆడు సంవచ్చరమంతా జపం సేత్తుంటాడు. ఎవలితోటైనా ఒక ముక్కైనా మాటాడితే వట్టే. ఒక్క కార్తీక పున్నమినాడే మాటాడుతాడు. ఆ రోజు ఆ దేవుడిని సూడ్డానికి, వరాలడగడానికి, సుట్టు పక్కల పల్లెటూరోళ్ళూ ఇంకా సాలామంది జనం కారుల్లోనూ వస్తారు. ఆ దేవుడి పవరు సాలా గొప్పది. మనందరం ఎళదాం. మనకీ సిల్లంగి బెడదా తప్పుద్ది. పోలీసు కేసులూ సుట్టుకోవు. గండం గడిచిపోతాది" అందరికి అతడు నచ్చజెప్పాడు.

అందరూ అంగీకరించారు. ముసల్దాన్ని వారు వదిలేసారు.

ఎలాగైనా ముసలమ్మకు విముక్తి కలిగిందని సంతోషిస్తూ కామేశ్వరరావు అక్కడినుండి బయలుదేరబోయాడు. పెంచలయ్య అతడి దగ్గరకు వచ్చి పక్కకు తీసుకు వెళ్ళాడు.

సూడు బాబూ, మనిద్దరి ఆలోసన ఒకటే. ఆ ముసలమ్మను రచ్చించాల. జనాలకు పట్టిన దెయ్యాన్నైనా దేవుడికైనా వగ్గించడం చాలా కట్టం. నీ మారగంలో నువ్వు పెయత్నం సేసావు. ఆళ్లు యినలేదు. అందుసేత ఆదేవుడి పేరు సెప్పి దాన్ని రచ్చించాను".

"అర్ధమయింది" అంటూ కామేశ్వర రావు బయలుదేరాడు.

'కెంగువ' జాతరకు పల్లెలోని జనాలంతా తరలి వెళ్ళారు. మనిషిలాటి దేవుడిని దర్శించుకొని నయివేద్యాలుపెట్టారు.

మూడు రోజుల తర్వాత ప్రతి గుడిసెలోనూ చూరుకు నిమ్మకాయలు వేలాడదీయబడ్డాయి. ఆటికి సాలా పవరుంది. ఇక తమ గడపలోకి బూతాలూ, దెయ్యాలూ, సిల్లంగీ, సీడా రాదని అందరూ ధైర్యంగా ఉన్నారు.

ఈలోగా హెల్త్ డిపార్టుమెంటు వాళ్ళు ఆ ఊరి మరణాలపై విచారించారు. చనిపోయిన పిల్లలిద్దరూ మలేరియా జ్వరాలతో చనిపోయారని, ఇలాంటికేసులు చుట్టు ప్రక్కల గ్రామాల్లో కూడ ఉన్నాయని చెప్పారు. పొలంలో మరొక వ్యక్తి చనిపోవడానికి కారణం అతడిలో ఏదో గుండెజబ్బు ఉండి ఉండాలన్నారు.

పదిరోజులు తర్వాత ఆ గూడేనికి కామేశ్వర రావు మళ్లీ వెళ్ళాడు. జనాలతడి చుట్టూ చేరారు. అందులో నుండి మల్లయ్య ముందుకు వచ్చి అన్నాడు. "చూసావా ఆ దేవుడి పెసాదం పవరు. ఆ నిమ్మకాయలు గడపలో ఏలాడదీస్తే ముసిల్ది ఏమీ సెయ్యనేకపోయింది. దాని సిల్లంగి దానికే తిరిగి కొట్టింది".

"దానికేమయింది?"

సచ్చిపోయింది.

"ఎప్పుడు?"

"రెండు పూటల కిందటే. రాతిరేల ఊరిమధ్యలో కూకుని టపీమని సచ్చింది. ఎవడికొంపలో సిల్లంగి ఎట్టడానికి కూకుందో గాని దాని పీడ వదిలిపోనాది."

అతడు మోటారు సైకిలు స్టార్టు చేసుకుని ఊరి బయట మలుపు దగ్గర ఉన్న ముసిల్దాని గుడిసె వద్దకు వెళ్ళాడు. ఆమె కొడుకుతో తల్లి మరణం గురించి ప్రస్తావించాడు. ఆ కొడుకు అతడితో అన్నాడు. "ఈళ్లందరికీ తెలీని యిసయం ఒకటుంది బాబూ, నా తల్లికి కేన్సరు జబ్బుంది. పట్నంలో పెద్ద డాకటర్లకు సూపించేను. అది మరో నెలరోజుల కన్నా బతకదని నెలరోజుల కిందటే సెప్పేసారు. మందులూ మాకులూ పనిసెయ్యవన్నారు అందుకే దాని నలా వగ్గేసాము".

"ఈ విషయం ఊర్లో ఇంకెవరికైనా సెప్పేవా?"

"సెప్పనేదు. నా తల్లి మీద ఇజయం సాదించేమన్న ఆనందంతో ఆళ్లున్నారు. ఆళ్ల ఆనందం ఆళ్లకుండనీ."

కామేశ్వరరావు అక్కడ నుండి కదిలాడు. అతడి మనసులో సందేహం ఎవరు విజయం సాధించారు? తానా? పెంచలయ్యా? ఆ పల్లెలోని జనాలా?

★